## బీఆర్ఎస్ కార్యకర్త మృతికి సంతాపం



తేజావత్ ఈర్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రఘునాథపాలెం, జూన్ 3: కాంగ్రెస్ నాయకుల దాడిలో మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్త తేజావత్ ఈర్య అలియాస్ పాప మృతికి బీఆర్ఎస్ నేతలు సంతాపం తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండల పరిధిలోని శివాయిగూడెంలో ఉన్న ఈర్య స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులు మాజీ ఉప సర్పంచ్ శారద, కుమారుడు లాలును పరామర్శించారు. కాంగ్రెస్ గూండాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నివాళి అర్పించిన వారిలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ సర్పంచ్ చెరుకూరి ప్రదీప్, గ్రామ అధ్యక్షుడు నంద పాల్గొన్నారు.

## మత సామరస్యాన్ని పాటించాలి

**పీస్ కమిటీ సభ్యుల సమావేశంలో సీపీ సునీల్‌దత్**



పీస్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, జూన్ 3: మత సామరస్యానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని ఖమ్మం సీపీ సునీల్‌దత్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పీస్ కమిటీ సభ్యులతో సోమవారం ఏర్పాటుచేసిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే అక్రమ రవాణా కట్టడికి కమిషనరేట్ పరిధిలో 7 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. పశువుల అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రార్థనలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. సమావేశంలో గంటేల విద్యాసాగర్, కే విజయపాల్‌రెడ్డి, బీ రామకృష్ణ, అసద్, ఎస్‌డీ ఆయూబ్, మొహియుద్దీన్ పాల్గొన్నారు.

**నేడు మద్యం దుకాణాలు బంద్: సీపీ**

లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాలు బంద్ చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీ ఉదయం 6 నుంచి 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాల్లో విక్రయాలు చేపట్టవద్దని ఆదేశించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో వైన్ షాప్‌లు, బార్లు, సరఫరా చేసే రెస్టారెంట్లు మూసివేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కారణంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉంటేందుకు ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

మధిర, జూన్ 3: మధిరలోని గ్రీన్‌ఫీల్డ్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. మే 1 నుంచి ప్రారంభమైన ఈ శిబిరంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం 60 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ టీ.సునీల్‌రెడ్డి శిబిరంలో హాజరై విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. మధిర ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జి, బ్యాడ్మింటన్ కోచ్ చిన్ని, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

BUSINESS OFFER

NTKMM–

WANTED


jobs

18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-AII

గమనిక

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ



నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616



వైరా టౌన్‌లో కేక్ కట్ చేస్తున్న మదన్‌లాల్



మధిరలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



ఖమ్మంలో జెండా ఆవిష్కరిస్తున్న ఆర్‌జేసీ కృష్ణ



వైరాలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నేతలు

# త్యాగాల ఫలమే 'తెలంగాణ'

- **దశాబ్దంలో రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌ది**
- **రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు**

ఖమ్మం/ వైరా టౌన్/ ఖమ్మం రూరల్, జూన్ 2: కేసీఆర్ ఉద్యమం, అమరుల త్యాగాల ఫలమే నేటి తెలంగాణ అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు పిడికిలితో ఉద్యమించిన బక్కపలచని కేసీఆర్.. తెలంగాణ సమాజాన్ని ఏకం చేసి స్వరాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మూడో రోజు వేడుకల్లో పార్టీ నేతలు పార్టీ జెండాల ఆవిష్కరణలు, ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీలు, కేక్‌ల కటింగ్‌లు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ప్రజా పోరాటంతో తెలంగాణను సాధించిన ఉద్యమ నేత కేసీఆర్.. అదే ప్రజల సహకారంతో దశాబ్దాల కాలంపాటు స్వరాష్ట్రాన్ని తీర్చిదిద్దారని, దేశానికి ఆదర్శంగా నిలిపారని గుర్తుచేశారు. తెలంగాణను ప్రగతిబాటలో పయనింపజేసిన ఘనత కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుందని స్పష్టం చేశారు. వైరాలో మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్, ఐదు మండలాల బీఆర్ఎస్ నాయకులు, ఖమ్మంలో పార్టీ సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ, తోట వీరభద్రం, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కస్తూరి లక్ష్మీనారాయణ, ముత్తబోయిన లక్ష్మీనారాయణ, పులిపాటి సంపత్, ఖమ్మం రూరల్లో పార్టీ నాయకులు బెల్లం వేణు, యండపల్లి వరప్రసాద్, గూడ సంజీవరెడ్డి, లక్ష్మణ్‌నాయక్, పేరం వెంకటేశ్వర్లు, బానోత్ కృష్ణ, గడ్డా వీరన్న, బండి సతీష్, జానకిరాములు, మట్టా వెంకటేశ్వరరావు, సతీష్, బాలునాయక్, వీరెల్లి అప్పారావు, గిరి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఖమ్మం తెలంగాణ భవన్‌లో తెలంగాణతల్లి, జయశంకర్ సార్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న రూరల్ నేతలు



వైరా టౌన్: వైరాలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి 'జై తెలంగాణ' నినాదాలు చేస్తున్న మదన్‌లాల్, పార్టీ నేతలు

# రైతులకు ఇబ్బందులు రానివ్వం

- **పచ్చిరొట్ట, విత్తనాలకు కొరత లేదు.. అక్రమాలకు పాల్పడొద్దు..**
- **వరికి బదులుగా పండ్ల తోటలు, పామాయిల్ సాగు చేయండి**
- **సివిల్ సప్లయీస్‌కు ధాన్యం విక్రయించిన రైతులకు రూ.500 బోనస్**
- **కూసుమంచిలో రైతుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

కూసుమంచి, జూన్ 3: వానకాలంలో రైతులకు ఇబ్బంది కలుగకుండా ఎరువులు, విత్తనాల పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే నిర్ణయించిన ధరలకు విత్తనాలు రైతులకు అందిస్తున్నామని, ఇబ్బంది లేకుండా పంపిణీ చేస్తామని అన్నారు. అలాగే వరికి బదులుగా పండ్ల తోటలు వేయాలని సూచించారు. కూసుమంచి మండలం పోచారంలో స్థానిక రైతులతో సోమవారం ఆయన మాట్లాడారు. జీలుగులు, పచ్చిరొట్ట విత్తనాలు పక్క రాష్ట్రం నుంచి రావాల్సి ఉందని, రెండు రోజుల్లో రైతులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. గతం కంటే రెట్టింపుగా పచ్చిరొట్ట విత్తనాలను ఇప్పటికే రైతులకు అందజేశామన్నారు. పంటలకు పచ్చిరొట్ట ఎంతో మేలు చేస్తుందని అన్నారు. దీనిని ఎక్కువగా వినియోగిస్తే రసాయన ఎరువుల వినియోగం క్రమంగా తగ్గుతుందని అన్నారు. జిల్లా సరిహద్దులోని ఆంధ్రా ప్రాంత రైతులు జీలుగు విత్తనాలను అధిక ధరకు తీసుకెళ్తున్నట్లు తమకు సమాచారం ఉందని అన్నారు. ఈ అంశంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**పామాయిల్‌తో మంచి లాభాలు..**

అలాగే, పామాయిల్‌తో మంచి లాభాలు వస్తాయని మంత్రి తుమ్మల తెలిపారు. పామాయిల్ సాగు విషయంలో రైతులు అనేక అపోహలతో ఉన్నారని, నాలుగేళ్లపాటు పంట రాదనే అనుమానంతో ఉన్నారని అన్నారు. అయితే ఈ నాలుగేళ్లూ పామాయిల్‌లో అంతర్ పంటలు సాగు చేసుకుంటూ ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. వరికి ఎకరాకు కావాల్సిన నీరు.. పామాయిల్‌కు నాలుగు ఎకరాలకు సరిపోతుందని అన్నారు. సాగర్ కాలువ భూములు కూడా పామాయిల్‌కు అనుకూలంగా ఉంటాయని అన్నారు. అలాగే, విత్తనాల విషయంలో కఠినంగా ఉంటామని, వాటిని అధిక ధరలకు విక్రయించినా, బ్లాక్ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా గత యాసంగిలో పౌర సరఫరాల శాఖకు ధాన్యం విక్రయించిన రైతులకు రూ.500 బోనస్ ఇస్తామని అన్నారు. నాయకులు పాల్గొన్నారు.

**వెంకటరెడ్డి కుటుంబానికి పరామర్శ**

మాజీ ఎంపీపీ రామసహాయం వెంకటరెడ్డి కుటుంబాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. వెంకటరెడ్డి తల్లి పద్మమ్మ మరణించడంతో మండలంలోని పోచారం గ్రామంలో వారి స్వగృహంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు.

# రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి: కలెక్టర్



వివరాలు నమోదు చేసుకుంటున్న కలెక్టర్, ఎలక్షన్ అబ్జర్వర్

ఖమ్మం రూరల్, జూన్ 3 : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. సోమవారం మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద కంట్రోల్ రూంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జీ కోల్టే, కౌంటింగ్ పరిశీలకుడు ప్రేదిమన్ కృష్ణన్ భట్‌ల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ ప్రక్రియ శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, 7 అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంల ఓట్ల లెక్కింపు కోసం ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందిని బృందాల వారీగా ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ వినియోగించుకొని పారదర్శకంగా కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఏఆర్వోలు ఆదర్శ్ సురభి, బీ.సత్యప్రసాద్, వేణుగోపాల్, ఎం.రాజేశ్వరి, గణేశ్, రాజేందర్, మధు, శ్రీనివాస రెడ్డి, కలెకరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

**మద్యం మత్తులో యువకుల ఘర్షణ**

## విచక్షణా రహితంగా దాడి.. వ్యక్తి మృతి..

బోనకల్లు, జూన్ 3: మద్యం మత్తులో ముగ్గురు వ్యక్తులు ఘర్షణ పడగా ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం వేములనర్వ గ్రామానికి చెందిన ఉయ్యాల నాగేంద్రబాబు (25)కు ఏడాది క్రితం గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం చల్లగరిక గ్రామానికి చెందిన నాగసత్యతో వివాహమైంది. నాగేంద్రబాబు అత్తగారింటి వద్దే నివాసం ఉంటున్నాడు. తల్లిని చూసేందుకు గత నెలలో వేములనర్వ వచ్చాడు. ఆదివారం సాయంత్రం మద్యం తాగేందుకు బోనకల్లు వచ్చాడు. అక్కడ మద్యం తాగిన తర్వాత ఆ మత్తులో సీసాను పగులగొట్టి ముక్కలు విసిరేయడంతో మరోచోట మద్యం తాగుతున్న బోనకల్లుకు చెందిన బొబ్బిళ్ల ఉపేందర్, మోర పరశురామ్ వద్ద పడ్డాయి. దీంతో ఉపేందర్, పరశురాం.. నాగేంద్రబాబుతో ఘర్షణ పడుతుండగా వైన్‌షాపు నిర్వాహకులు వారిని బయటకు పంపించేశారు. బయటకు వచ్చాక ఉపేందర్, పరశురాం కలిసి నాగేంద్రబాబుపై విచక్షణ రహితంగా దాడి చేశారు. దీంతో నాగేంద్రబాబు మద్యం మత్తులో ఇంటికి వెళ్తూ బోనకల్లు సమీపంలో ఉన్న సాగర్ కాలువ బ్రిడ్జి వద్ద పడిపోయాడు. స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా నాగేంద్రబాబు సోదరుడు గోపి తన ఆటోలో కుటుంబసభ్యులతో వచ్చి నాగేంద్రబాబును ఇంటికి తీసుకెళ్లాడు. అతడు స్పృహలో లేకపోవడంతో కుటుంబసభ్యులు తెల్లవారుజామున ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి నాగేంద్రబాబు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడు గోపి బోనకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. కాగా, విషయం తెలుసుకున్న వైరా ఏసీపీ రెహమాన్, మధిర సీఐ మధు కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మద్యం దుకాణం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

**బైకును ఢీకొట్టిన లారీ..**

## తండ్రీ కొడుకు దుర్మరణం



పిల్లి పేరయ్య, పిల్లి అశోక్ (ఫైల్)

సత్తుపల్లి టౌన్, జూన్ 3: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో తండ్రీ కొడుకు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన సింగరేణి బైపాస్ రోడ్డు వై జంక్షన్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన పిల్లి వీరయ్య (52), అతడి కుమారుడు పిల్లి అశోక్ (30) కలిసి సోమవారం సత్తుపల్లిలోని ఆస్పత్రికి వచ్చి ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో కిష్టారం ఓసీ వద్ద కంటైనర్ లారీ ఢీకొనడంతో తండ్రి, కొడుకు అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలు నుజ్జునుజ్జయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా, అశోక్ భార్య గర్భిణి. అతడికి ఒక కుమారుడు ఉన్నాడు. తండ్రీ కొడుకు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## రిటైర్డ్ డీఎల్‌పీవో ప్రభాకర్‌కు సన్మానం



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

పెనుబల్లి, జూన్ 3: ఇటీవల పదవీ విరమణ పొందిన డీఎల్‌పీవో ప్రభాకర్‌రావును వీఎం బంజరలో మాజీ సర్పంచ్ భూక్యా పంతులు నివాసంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు మాట్లాడుతూ.. ప్రభాకర్‌రావు వల్లనే పంచాయతీల్లో పూర్తిస్థాయి పారిశుధ్య కార్యక్రమాలు, ట్రాక్టర్ల వినియోగం వంటివి జరిగాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు భూక్యా ప్రసాద్, కనగాల సురేశ్‌బాబు, ఎస్కే గౌస్, మందడపు అశోక్‌కుమార్, తేజావత్ తావునాయక్, కోమటి ప్రసాద్, యలమర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్ ఫలితాల్లో జిల్లాకు స్టేట్ ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న 'త్రివేణి' బాధ్యులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 3: పాలిసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు టాప్ ర్యాంక్‌లు సాధించారు. ఎంపీసీ విభాగంలో పెనుబల్లికి చెందిన టీ.హరీష్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. టెన్త్‌లో టెన్ జీపీఏ సాధించాడు. కల్లూరుకి చెందిన వై.హాశీష్ రాష్ట్రస్థాయి 8వ ర్యాంక్ సాధించాడు. ఖమ్మం శ్రీచైతన్య ఒలింపియాడ్ స్కూల్లో టెన్త్‌లో 9.8 జీపీఏ సాధించాడు. మోక్షిత సాయి స్టేట్ టెన్త్ ర్యాంక్ సాధించాడు. 120 మార్కులకు నిర్వహించిన పరీక్షలో 118 మార్కులు సాధించాడు. మోక్షిత సాయి ఖమ్మం త్రివేణి పాఠశాలలో టెన్త్‌లో టెన్ జీపీఏతో సత్తా చాటాడు. పాలిసెట్‌లో టాప్ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులంతా ఇప్పటికే ఇంటర్మీడియట్ అడ్మిషన్ తీసుకోవడం గమనార్హం. ఎంబైపీసీ విభాగంలో హరీష్ 7వ ర్యాంక్, మోక్షిత సాయి 32వ ర్యాంక్, అనన్య 58వ ర్యాంక్ సాధించారు. విద్యార్థులను ఆయా పాఠశాలల యాజమాన్యాలు అభినందించాయి.

## రెన్యూవల్ చేసుకున్నా రుణమాఫీ వర్తింపు: ఆర్‌ఎం



మాట్లాడుతున్న ఆర్‌ఎం రియాజ్

పెనుబల్లి, జూన్ 3: ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ.. పంట రుణాలను రెన్యూవల్ చేసుకున్న రైతులకు కూడా వర్తిస్తుందని ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ రియాజ్ తెలిపారు. రైతులందరూ సకాలంలో తమ పంట రుణాలను రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. పెనుబల్లిలో ఏపీజీవీబీ శాఖ నూతన భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. డిపాజిట్లపై అత్యుత్తమ వడ్డీ రేటు చెల్లించేది కేవలం ఏపీజీబీవీ మాత్రమేనని అన్నారు. తమ బ్యాంకులోని అత్యుత్తమైన సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్రాంచ్ మేనేజర్ ఆన్సార్, ఫీల్డ్ ఆఫీసర్ పృధ్వీ, పీవో ఐటీ అనిల్, అకౌంటెంట్ హారిక, క్యాషియర్ వరలక్ష్మి, శ్రావణి పాల్గొన్నారు.

## 'పోడు రైతులపై వేధింపులు ఆపకుంటే ఉద్యమం'

కారేపల్లి, జూన్ 3: దశాబ్దాలుగా పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులపై అటవీశాఖ అధికారుల వేధింపులు ఆపకుంటే ఉద్యమిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. కారేపల్లిలోని అటవీశాఖ కార్యాలయంలో పోడుసాగుదారులతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాగు పనులు మొదలయ్యే సమయంలో అటవీ అధికారులు కొర్రీలు పెడుతున్నారని, రైతులకు గతంలో జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకాలను పరిశీలించే వరకూ సాగు చేయవద్దని నోటీసులు జారీ చేయడం దారుణమని అన్నారు.

## గాయకురాలు కవితకు ప్రతిభా పురస్కారం

కూసుమంచి, జూన్ 3: మండలంలోని జక్కేపల్లికి చెందిన అభ్యుదయ, జానపద పాటల గాయకురాలు కోడిరెక్క కవితకు ప్రతిభా పురస్కారం లభించింది. స్వాతంత్ర్య సమరయోధుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా రాకే కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు కవితకు ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు.

## బోనమెత్తిన నర్సింహులగూడెం

కూసుమంచి, జూన్ 3: మండలంలోని నర్సింహులగూడెంలో యాదవులు, ముదిరాజులు సోమవారం తమ కుల దేవతలకు బోనాలు సమర్పించారు. ముదిరాజులు పాండవులకు బోనాలెత్తి ఊరేగింపుగా గుట్టవద్దకు వెళ్లి నైవేద్యాలు సమర్పించారు. చిన్నారులకు పాండవుల వేషధారణ వేశారు. యాదవులు గంగమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు ఊరేగింపుగా వెళ్లి బోనాలు చెల్లించారు. పండుగ వాతావరణం నెలకొంది.

## 'పోడు రైతులపై బెదిరింపులకు పాల్పడితే సహించం'

వైరా టౌన్, జూన్ 3: కారేపల్లి మండలంలోని పోడు రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు భూకా వీరభద్రం సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. పోలీసులు వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అటవీ అధికారులు బెదిరిస్తున్నారని అన్నారు. పోడు రైతుల విషయంలో వారు తమ వైఖరిని మార్చుకోవాలని కోరారు. మండల వ్యాప్తంగా పోడు రైతులకు అటవీశాఖ అధికారులు నోటీసులు ఇచ్చారని, భూములు ఖాళీ చేయాలని సూచించారని అన్నారు. ఈ విషయాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

సత్తుపల్లి, జూన్ 3: పట్టణంలోని అయ్యగారిపేటలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. హనుమత్ జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాల్లో వ్యవసాయ అధికారుల తనిఖీ

వైరా టౌన్, జూన్ 3: మండలంలోని విత్తన, ఎరువుల దుకాణాలను వ్యవసాయ సంచాలకులు, ఏడీఏ కరుణశ్రీ, మండల వ్యవసాయ అధికారి ఎస్ పవన్‌కుమార్, ఎస్‌హెచ్‌వో వంశీకృష్ణ సోమవారం తనిఖీలు నిర్వహించారు. రైతులకు విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, నకిలీ విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్‌బోర్డుపై రోజు వారి వివరాలు రాయాలని సూచించారు.